


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మొదటి దొంగతనం

**మా సందానీగాడింటికి** పొద్దున్నే ఓ రాచకార్యం మీద వెళ్ళేసరికి, వాడు బిజిలీ అనే తన మేకపిల్ల విసర్జించిన కుంకుడు గింజల్లాంటి ఎరువు ఏరుతున్నాడు. అలా ఏరిన ఎరువుని తర్వాత గులాబీ మొక్కలకి వేసి, నా మొహం అంత గులాబీలు పూయిస్తాడుట.

"ఏ.వీ రమణీ నువ్వు బీ ఏరు" అన్నాడు.

"ఛీ నీ మొహం ఈడ్చా. నేను మంచి పనిమీదొస్తే ఇలాంటి దరిద్రపు పనులు చెప్తావేం?" అన్నాను.

"ఏందా మంచి పని? నీకీ గోరింటాకు కొయ్యాలా?" అడిగాడు.

"కాదురా. సంక్రాంతొస్తోంది. బొమ్మలు పెట్టాలి" అన్నాను.

"పెట్టుకో" అన్నాడు.

"నీ హెల్ప్ కావాలిరా" అన్నాను.

"మరి నాకీ హెల్ప్ చెయ్యనన్నావుగా?" అన్నాడు.

ముక్కు మూసుకుని 'మే..' అని అరుస్తున్న బిజిలీ వైపు చూస్తున్నా. దానికీ లోకువైపోయాననుకుంట నా మొహం కేసి చూసి ఫ్రెష్ గా ఎరువు ఉత్పత్తి చేస్తోంది.

"సరే నేను డబ్బా పట్టుకుంటా. నువ్వు ఏరు" అన్నాను.

ఆ డబ్బా నా చేతికిచ్చి "ఏం చెయ్యాల?" అన్నాడు.

"సినిమా హాల్ కట్టాలి" అన్నాను.

"తాజ్‌మహల్ కట్టొద్దా?" అని నవ్వాడు.

"ఉన్న ఒక్క క్రమాలో నాకీ, నాకీ చెల్లెకీ, తమ్మునికి, చోటీమాకీ, దోనోం బేటాకీ, అమ్మకీ, అబ్బాకీ జాగాల్లేవు పండుకోనీకి. ఇంకో క్రమా కట్టనీకి అయితే లేదు. నీకు ఇప్పుడు సినిమా హాల్ కట్టాలా? అంత పైసా ఉంటే, బిజిలీకి ఇంకో పోతు మేకకి కొనేటోడ్ని" అన్నాడు.

"ఓరి మొద్దు బండబుద్ధిలేని వెధవా. నిజం సినిమా హాల్ కాదు. బొమ్మ సినిమా హాల్" అన్నాను.

వాడు ఉషారుగా ఆ మేక పెంటికలు ఏరుతున్న చెయ్యి నా భుజం మీద వేసాడు. నేనేం అనలేదు. ఏ అన్నా నా పని జరగదు. అందుకే భుజం కదిపి, చెయ్యి తీయించుకుని, "వెళ్ళి చేతులు కడుక్కురా. ఐస్‌క్రీమ్ పుల్లలు ఏరాలి" అన్నాను.

సందానీ పెద్దగా నవ్వి "నీకీ మెదడుల గోబర్ ఉన్నాయ్. పదిమంది చాయ్ తాగితే ఒక చాయ్ వస్తది మన ఇంట్ల. వంద పుల్లలు ఏరినా, ఒక్క ఐస్‌క్రీమ్ రాదు" అన్నాడు.

అందరూ తాగేసిన కప్పుల్లోంచి, మిగిలిన టీ చుక్కలు ఒక కప్పులో పోసుకుంటే, వాడింట్లో కప్పులో అరకప్పు చాయ్ వాడికొక్కడికే వస్తుందని గతంలో చెప్పి మురిసిపోయినట్లు గుర్తుంది నాకు.

"వెధవా! ఐస్‌క్రీమ్ పుల్లలకి ఐస్ క్రీమ్ అంటుకుని అలాగే ఉంటుందని నా ఐడియాకాదు. వాటితో సినిమా హాల్ ఎలా కట్టాలో మా అన్నయ్య చెప్తానన్నాడు" అన్నాను.

వాడు బద్దకంగా ఒళ్ళు విరుచుకుని "నాకేమిస్తాయ్ ఆ పని చేస్తే?" అన్నాడు.

వాడు బిజినెస్ టాక్స్‌లో కొచ్చేసాడు సరాసరి.

"అమ్మమ్మ వత్తుల పెట్టిలోంచి పావలా తెచ్చిస్తాను" అన్నాను.

వాడు డబ్బాలోకి చూసుకుంటూ "నాకు చాలా పనులున్నాయ్. రమేష్‌గాడింటికి పోతయ్" అన్నాడు.

"అక్కడేం రాచకార్యాలూ?" కోపంగా అడిగాను. వాడికి పావలా సరిపోలేదని తెలిసి.

"రమేష్‌గానింట్ల చాలా మేకలున్నయ్" అన్నాడు.

"ఈ మేక పెంటికలు ఏరుకోవడమే కానీ పనికొచ్చే పనిచెయ్యవా?" అరిచాను.

"కమ్ సే కమ్ బారానా ఇయ్యి" అన్నాడు.

"ముప్పై పైసలు"

"ఆఠానా"

"ఇవ్వను. అర్ధరూపాయ్"

వాడు పగలబడి నవ్వి "పగ్‌లీ.. ఆఠానా అంటే అర్ధరూపాయి. ఛల్.. పోయి పైసలు తీస్కురా" అన్నాడు.

"ముందు పుల్లలు ఏరదాం రా" అన్నాను.

"ముందు పైసలు" అన్నాడు.

"ఏం చేస్తావ్? వాటితో"

"అమితాబ్ బచ్చన్ సెన్మా చూస్తయ్. అమర్ అక్బర్ ఏంథోనీ."

నాకు గొప్ప ఉత్సాహం వచ్చేసింది. "మరి చూసొచ్చాక నాకు కథ చెప్తావా?"

"చెప్తయ్"

"సరే ఇప్పుడే తెచ్చిస్తా. కానీ మరి నా సినిమా హాలో?" అన్నాను.

"గందుకే సిన్మాకి పోతా అన్నా. మస్తు ఐస్ క్రీమ్ పుల్లలు దొరుకుతయ్ ఆడ" అన్నాడు.

నా మిషన్ మీదే వాడు వెళ్తున్నాడు పాపం. ఆన్ డ్యూటీ అని గొప్ప ఉత్సాహంతో రెండు అడుగులు వేసి మళ్ళీ డౌట్‌గా వెనక్కొచ్చి "సినిమా నుండి ఎప్పుడొస్తావ్? నేనూ వచ్చి హాల్ బయట నిలబడనా?" అడిగాను.

"ఒద్దు. నేను పుల్లలు తీసుకుని సాయంకాలం వస్తాగా. టైం అయిపోతుంది. తొందరగా తెయ్యి" అన్నాడు.

నేను ఇంటికి పరిగెత్తాను. అమ్మమ్మ వంటింటి గడపమీద మొహం మీద కొంగు కప్పుకుని పడుకోలేదు. సీత అత్తయ్యతో మాట్లాడ్తోంది.

"కమల పురుడు మా ఇంట్లో పోసుకో. ఏం పరవాలేదు. ఆ వెనక వసారాలో పురిటి మంచం వేస్తాను. అడ్డం ఉండదు" అని.

నేను పిల్లిలా అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్ళాను. వత్తుల డబ్బా చూస్తే హుషారొచ్చింది. కానీ ఇలా ఎప్పుడూ పైసలు తియ్యలేదు. లడ్డూలో, బెల్లం ముక్కలో, మాగాయ ముక్కలో దొంగిలించాను కానీ. ఇది మొదటి దొంగతనం.

స్టూలెక్కి వత్తుల డబ్బా తీస్తుంటే వినపడింది సీత అత్తయ్య గొంతు "చిన్నప్పుడే చెప్పాల్సింది దొంగతనం పాపం అని. తోటకూరనాడే చెప్పాల్సింది సామెతలా"

నన్నే అంటోందా? నా కాళ్ళు వణికాయి.

"పోలీసులు వెంట పడ్డాక ఇప్పుడు అనుకుని లాభం ఏంటి?" అమ్మమ్మ గొంతు.

"అయినా అప్పుడే తన్ని మక్కెలు విరగ్గొడ్తే పెద్దయ్యాక ఈ పనులు చెయ్యరు"

నా కాళ్ళు వణికి నేనెక్కిన స్టూలు కదిలి, పక్కనున్న రాగిబిందెకి తగిలి 'ఢాం' అన్న శబ్దం వచ్చింది. రాగిబిందె మీదున్న చెంబు కిందపడి అందులోంచి నేను ఎన్నడూ చూడని విధంగా చిల్లర డబ్బులు కింద దొర్లాయి. అచ్చు నేను చూసిన సినిమాలో లంకెబిందెల్లా అన్నమాట.

"ఏయ్. ఏవిటా శబ్దం?" అమ్మమ్మ అరుపు.

"పిల్లి. పిల్లి అమ్మమ్మా" అన్నాను.

"దొంగపిల్లి. కన్ను మలగనివ్వదు. దిక్కుమాలిన సంత. వెళ్ళగొట్టు" అని సీత అత్తయ్యతో కబుర్లు కొనసాగించింది.

"అయినా పెళ్ళానివి నీకు తెలీదుటే వాడు ఆఫీస్ డబ్బు దొంగతనం చేస్తే జైల్లో పెడ్తారని చెప్పొద్దూ"

నేను నేలమీద పడ్డ చిల్లర ఏరుతున్నదాన్నల్లా ఆగి విన్నాను.

"నాకేం తెలుసు రవణ పిన్నిగారు. ఇలా ఐదుగురు పిల్లలూ, నేనూ రోడ్డుమీద పడి జీవితాలు నాశనం అయిపోతాయనీ"

ఆ తర్వాత సన్నని శబ్దం ఆవిడ ఏడుస్తున్నట్లుగా. నేను చేతిలో వున్న ఐదు, పది, పావలా అర్ధరూపాయీ బిళ్ళల కేసి చూసాను. అన్నీ కలిపితే ఐదు రూపాయిలుంటాయి. గబగబా ఏరి చెంబులో పోసి, ఒక అర్ధరూపాయి నా గౌను జేబులో వేసుకున్నాను. ఆ చెంబు పైన పెడ్తుండగా, "సున్నుండలు చేసా. పిల్లలకి నాలుగు పట్టికెళ్ళు" అంటూ అమ్మమ్మ వంట గదిలోకి రావడం తెలిసింది.

నేను చెంబు పెట్టేసి, గభాల్న ఇవతలకి తిరిగాను. "ఏం చేస్తున్నావే దొంగ పిల్లిలా?" అంది అమ్మమ్మ.

ఈవిడకి దేవుడు ముందు కళ్ళుపెట్టినప్పుడే, వెనుక కూడా తలమీద కళ్ళు పెట్టినట్లున్నాడు.

"అవే.. అవే." అని నీళ్ళు నమిలాను.

"అవేనా? దొంగమొహమా మీ సందానీ అడిగాడా?" అంది.

ఈ పెద్దాళ్ళు పోలీసులకన్నా చురుకు. ఈవిడ్ని పోలీస్ ఇన్‌స్పెక్టర్ చెయ్యాల్సింది అని అమ్మమ్మని ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లో ఊహించేసుకున్నాను.

"ఉండు ఇస్తా. తప్పుకో" అంది.

ఇదేంటీ? శివరాత్రి నాడు గుణనిధి, దొంగతనం చెయ్యడానికి గుడిలో చీకటిగా ఉందని ఒత్తి వెలిగిస్తే, శివుడు స్వర్గానికి తీసుకురావడానికి విమానం పంపాడని చదువుకున్నాం. అలా వత్తుల డబ్బా తీసానని శివుడు ఖుష్ అయి అమ్మమ్మ స్వయంగా నాకు చిల్లర ఇచ్చేట్టు చేస్తున్నాడా? భడవకానా దొంగతనం చేస్తావా? అని వంచి వీపుమీద బాదకుండా. అని నేను తెగ హాచ్చెరపోతుండగా

"ఇదిగో నీకు రెండూ ఆ సందానీగాడికి రెండూ" అని అమ్మమ్మ స్టీలు డబ్బాలోంచి సున్నుండలు తీసి ఇచ్చింది.

"హమ్మయ్య" దొంగతనం గురించి తెలీదు. సున్నుండలకే అనుకుంది అని నేను తేలిగ్గా నిట్టూర్చి, అవి పట్టుకుని బయటకి పరిగెత్తుకొచ్చా.

సరళా, భవానీ, మంజూ వాళ్ళు అప్పటికే బొమ్మలు పెట్టడానికి సరంజామా సమకూర్చుకున్నారు.

"వడ్రంగి దగ్గరకి వెళ్ళి రంపపు పొట్టు తెచ్చుకోవాలి. దానిలో ఆకుపచ్చరంగు కలిపి జల్లితే, పచ్చని పొలంలా ఉంటుందని" చెప్పింది భవాని.

నేనింకా ఐస్ క్రీమ్ పుల్లలు సంపాదించడంలోనే ఉన్నాను. అందుకు అర్ధరూపాయి దొంగతనం కూడా చేసేసాను. తెలిసాక అమ్మమ్మ వీపు విమానం మోత మోగించేస్తుంది. అప్పుడు ఏ శివుడు అడ్డం పడ్తాడో చూడాలి.

చంద్రప్రభ ఓసారి జాతర మొత్తం ఇంట్లో సినిమా సెట్టింగ్ వేసినట్లు పెట్టింది. అప్పుడే సినిమా హాల్లో కుర్చీలు ఐస్క్రీమ్ పుల్లల్తో తయ్యారు చెయ్యడం నేను చూసాను. అన్నయ్యేమో చేసి పెట్టమంటే "ముందు ఆరువందల ఐస్క్రీమ్ పుల్లలు తీసుకురా" అన్నాడు.

అసలు ఈ రోజు సందానీ వెళ్ళే సినిమాలో ఆరువందలమంది ఐస్క్రీమ్ తినాలిగా అసలు. ఇలా ఆలోచించుకుంటూ సందానీ ఇంటికి వెళ్ళేసరికి పొడుగు లాగూ, ఎర్రబనీనూ వేసుకుని, మొహం మీద పేస్తర్లు పేస్తర్లుగా పౌడర్ అద్దుకుని, తలకి చెంపలమీదనుండి కారేట్లు నూనె రాసుకుని, సినిమాకి వెళ్ళడానికి రెడీగా కనిపించాడు.

"ఇదిగో అర్ధరూపాయి ఐస్క్రీమ్ పుల్లలు ఆరువందలయినా ఉండాలి" అని నేను చెప్తూ ఉండగానే "సరే..సరే" అని సైకిల్ వేసుకుని రయ్యిన వెళ్ళిపోయాడు సందానీగాడు.

నేను ఇంటికొచ్చేసరికి గుమ్మంలో పోలీసులు. గబుక్కున వేప చెట్టు వెనకాల దాక్కున్నాను. అమ్మమ్మ వాళ్ళకి ఇత్తడి చెంబుతో మంచినీళ్ళిస్తూ, ఏదో చెప్తోంది. పెద్దగా చేతులు తిప్పేస్తోంది సూర్యకాంతంలా.

"ఆసినీ అసాధ్యం కూల. నీ ముష్టి మరచెంబులో అర్ధరూపాయి తీస్తే మనవరాలిని కూడా చూడకుండా పోలీసులకి పట్టిస్తావూ? పెద్దయ్యాక నీ సీతత్తయ్య మొగుడిలా అవుతాననా నీ బాధ? దానికే నన్ను జైలులో పెట్టిస్తావా?" అని మనసులో ఏడ్చాను.

చిన్నవయసులో "పోలీసులకి పట్టిస్తా" అంటూ భయపెట్టే ఈ పెద్దవాళ్ళ దుశ్చర్యలు అన్నీ ఇన్నీ కావు. పదేళ్ళ వయసులో పోలీసులని చూస్తే ఎంత భయంగా ఉంటుందీ? నిజంగా యములాళ్ళు వచ్చినా అంత భయం వెయ్యదు. ఈ ఎర్రటోపీ పోలీసులని చూస్తే వేసినట్లు.

తీరా అర్ధరూపాయి తీసుకుని దసరాబుల్లోడిలా తయ్యారయి 'టింగురంగా'మని సందానీ గాడు సినిమాకి వెళ్ళిపోయాడు. ఇప్పుడేం చెయ్యాలి? వెళ్ళి అమ్మమ్మ కాళ్ళమీద పడిపోనా? అర్ధరూపాయి నేనే తీసానని చెప్పెయ్యనా? సీతత్తయ్య తలమీద చెంగు కప్పుకుని, పాత సినిమాల్లో శ్రీరంజనిలా వెనుకనుండి, విషాద సంగీతం వస్తుండగా, ఈవిడొకత్తి.

"వదిలిపెట్టకండి రవణ పిన్నిగారూ. చిన్నప్పుడే బుద్ధి చెప్పాలి తోటకూరనాడే అన్న సామెతలా. లేకపోతే మా ఆయనలా పెద్దయ్యాక గజదొంగ అవుతుంది" అని చెప్పడానికి. ఇలా భయపడ్తూ పోలీసులు వెళ్ళాక ఇంట్లోకి వచ్చాను.

అర్ధరాత్రి ఎవరో లేపుతున్నారు. నా ఒళ్ళంతా చెమటలు. "నేనే తీసా. పోలీసులకి చెప్పొద్దు" అంటున్నానట.

అమ్మ కంగారుగా నా మొహంలోకి చూస్తోంది.

"ఏవిటే ఆ కలవరింతలూ? ఒళ్ళు పేలిపోతోంది" అంటూ.

అమ్మమ్మ 'ఉఫ్' అని విభూది వూది నా మొహం మీదకి "ఆ సందానీ వెధవతో అడ్డమైన చోట్లకీ తిరుగుతుంటుంది. ఏదో తొక్కుంటుంది. పొద్దున్న ఆంజనేయస్వామి గుడికి తీసుకెళ్ళు" అంటోంది.

నన్ను రెక్కలు విరిచి కట్టి పోలీసులు తీసుకెళ్ళడం కలలో అని తెలిసి, నిశ్చింతగా పడుకున్నాను. ఆ తరువాత వాళ్ళ మాటల్లో తెలిసింది పోలీసులు సీతత్తయ్య మొగుడికోసం వచ్చారని.

అన్నయ్య నామీద జాలితో "పాపం జ్వరమొచ్చిందా? నేను పెట్టి పెడ్తాలే బొమ్మలు" అని, అందంగా ఐస్క్రీమ్ పుల్లలుతో కుర్చీలు చేసి, చిన్న అట్ట సినిమా హాల్ ముద్దుగా కట్టిపెట్టాడు.

"ఇదిగో ఏ.వీ రమణీ అమితాబ్ బచ్చన్ సినిమా బొమ్మ. సినిమా హాల్ మీద చిప్కాయించు" అంటూ 'అమర్ అక్బర్ ఏంథోనీ' పోస్టర్‌తో మర్నాడు సందానీగాడొచ్చాడు. పుల్లలూ లేవు పుడకలూ లేవు.

అన్నయ్యని "ఇన్ని పుల్లలు ఎక్కడ ఏరావురా?" అంటే.


"ఛీ అసహ్యంగా ఏరడం ఏవిటీ? అర్ధరూపాయిస్తే ఆ ఐస్క్రీమ్ బండివాడే ఇచ్చాడు" అన్నాడు.


"ఈ ఐడియా నాకెందుకు రాలేదూ?" తలమీద కొట్టుకున్నా.

"నాకూ రాలేదు. సందానీగాడే చెప్పాడు" అన్నాడు అన్నయ్య.

"వార్నీ" అన్నాను.

Post your comments







https://www.youtube.com/watch?v=ERaaX_IulS4